
# మతమా? మానవత్వమా?

పసుపులేటి తాతారావు



**బిక్కు బిక్కుమని గుండెలుగ్గ బట్టుకొని, ఎప్పుడే ఉపద్రవం వచ్చి పడుతుందోనని ఊపిరి బిగబట్టి, గుండె చప్పుళ్లే ఢంకా మ్రోతలై కర్ణ పుటాలను తాకుతున్న వేళ!...**

హైదరాబాద్ పాతబస్తీ జీవితంలో మత కలహాల మహమ్మారి మరోసారి వికృతంగా విలయ తాండవం చేసింది.

నిరవధిక కర్ఫ్యూ నిరాఘాటంగా కొనసాగుతోంది. తలవులు బిడాయించుకొని ఎవరి ఇళ్లల్లో వాళ్లు ప్రాణాలు అరచేతుల్లో పెట్టుకొని, క్షణాలను లెక్కిస్తూ బ్రతుకుతున్నారు.

రాత్రి పదిన్నర అయింది. భయంకరమైన నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. గత మూడు రోజులుగా కర్ఫ్యూ మూలంగా ఇంట్లోంచి కాలు బయట మోపడానికి వీల్లేకుండా పోయినందున పిచ్చెక్కినట్టుంది. దానికి తోడు ఒంటరితనం! ప్రస్తుతం ఈ ఇంట్లో నేనొక్కణ్ణే ఉంటున్నాను.

ఉన్నట్టుండి నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ వెలువడిందో గావు కేక! దాని వెనుకే మరి కొన్ని ఆర్తనాదాలు! హృదయ విదాకరంగా ఉన్నాయి.

"బచావ్, బచావ్"

"బాబోయ్, చచ్చిపోయాను"

"దేవుడా... రక్షించు"

నా గుండె లయ తప్పింది. ఒళ్లంతా మరోసారి ముచ్చెమటలు పట్టేశాయి. అవి నిజమైన ఆర్తనాదాలూ కావచ్చు లేదా ప్రతిరోజూ ప్రజల్ని ఊరికే భయభ్రాంతుల్ని చేస్తోన్న 'టేప్ రికార్డర్' కేకలైనా కావచ్చు. ఏది ఏమిటో తెలియని అసందిగ్ధ పరిస్థితి.

కాస్సేపటికి అరుపులు ఆగిపోయాయి. మళ్లీ గాఢ నిశ్శబ్దం అలుముకుంది. ఆ వెంటనే బయట మనుషులెవరో పరిగెడుతున్న బూట్ల చప్పుళ్లు. అన్నెం పున్నెం ఎరుగని అమాయక ప్రజల గుండెల మీదుగా సాగిపోతూన్న పదఘట్టనలా ఉన్నాయవి.

పక్కింటి మీద దాడి జరిగినట్టు తెలుస్తోంది. గేటు తోసుకొని గుంపుగా కాంపౌండ్‌లోకి చొరబడిన చప్పుడు. ఆ తర్వాత తెరవమని అరుస్తూ, బూతులు తిడుతూ, తలుపులు బాదుతున్న శబ్దాలు. ఇళ్లల్లో సురక్షితంగా ఉన్న వాళ్లని బయటికి లాగి పొడిచి చంపేంతగా మతతత్వం ముదిరి పోయిందీ మధ్య.

ఒక పక్క భయంగానే ఉన్నా, సహజమైన కుతూహలంతో బయట ఏం జరుగుతుందో చూడాలన్న కోరిక కలిగింది నాకు. కానీ బయటకు వెళ్లడం ప్రాణాంతకం. అందుకని మూసి ఉన్న కిటికీ చీలిక లోంచి ఒక కన్నుతో బయటికి చూశాను.

పది పన్నెండు మంది దుండగులు. అందరి చేతుల్లోనూ కత్తులూ, కటార్లు, గొడ్డళ్లూ! గుర్తు పట్టడానికి వీల్లేకుండా ముఖాలకి నల్లటి ముసుగులు.

అసలే చీకటి. వీధిలైట్లు ఎప్పుడో పగల గొట్టేశారు. మబ్బు పట్టిన ఆకాశంలోంచి అప్పుడప్పుడూ లిప్త కాలం పాటు మెరిసే మెరుపులు తప్ప మరే వెలుగూ లేదక్కడ.

గేటులోపలికి ప్రవేశించేటప్పుడు గేటు కొన తగిలి ఒకడి ముసుగు జారిపోయింది. కంగారుగా వెనక్కు తిరిగి గేటుకొన నుంచి దాన్ని విడిపించి మళ్లీ ముఖానికి తగిలించేసుకున్నాడు.

ఈ స్వల్ప వ్యవధిలో మెరుపు మెరిసి మాయ మవడం వల్ల జారిన ముసుగు తాలూకు ముఖం స్పష్టంగా నా మనో ఫలంక మీద ముద్రించుకు పోయింది.

ఆ ఇంటి వాళ్లు తలుపులు తెరవ లేదు. పాపం లోపల ప్రాణ భయంతో ఎంతగా వణికి పోతున్నారో? ఇనప రాడ్లతో, గొడ్డళ్లతో ఆ దుండగులు తలుపులు బద్దలు కొడుతున్నారు.

ఆ ఇంటి తర్వాత మళ్లీ ఏ ఇంటి మీదకి మళ్లుతారో ఎవరికీ తెలీదు. బహుశా ఆ దుండగులకే తెలీదేమో!

తలుపులు భళ్లున విరిగి పడిన చప్పుడు. ఇంకో క్షణంలో మరి కొందరు దీనుల ఆర్తనాదాలు వినవలసి వస్తుందేమోనని శిలా ప్రతిమలా అలా చూస్తూనే ఉండిపోయాను. కానీ ఎంత సేపటికీ నిశ్శబ్దానికి భంగం ఏర్పడలేదు. దుండగులు ఇంట్లోంచి బయటికీ, బయట నుంచి ఇంట్లోకి పిచ్చి పట్టినట్టు తిరిగారే తప్ప, నేను భయపడినట్టు ఎలాంటి బీభత్సాన్నీ సృష్టించలేకపోయారు. అంటే.. ఆ ఇంట్లో వాళ్లు వెనక వైపు నుంచి తప్పించుకు పోయారన్నమాట 'హమ్మయ్య' అనుకున్నాను రిలీఫ్‌గా.

కానీ ఆ దుండగులు వచ్చినంత తేలికగా వెళ్లిపోతారా? రెండు నిముషాల క్రితం వరకూ చిక్కటి

చీకటిలో మగ్గిన ఆ ప్రదేశమంతా క్షణాల్లో ఎర్రటి కాంతితో నిండిపోయింది. అగ్ని శిఖలు ఎగసి ఎగసి ఆకాశాన్ని అందుకోవాలని చూస్తున్నాయి. దుండగులు ధ్వంసం చేసి తగుల బెట్టిన ఆ ఇల్లు అగ్నికి ఆహుతై పోతోంది.

పావు గంటలో ఫైరింజన్, ముప్పావు గంటలో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకోవడం జరిగింది. అగ్ని జ్వాలలకీ, నీటి ధారలకీ జరిగిన సంకుల సమరంలో చివరికి నీళ్ల ధారలే గెలిచినా ఓడింది మాత్రం భస్మంగా మారిన ఇల్లు, దాని స్వంత దారులు. అప్పటి వరకూ ఎక్కడ దాక్కున్నారో, పోలీసుల్నీ, ఫైరింజన్‌నీ చూసి ధైర్యం వచ్చినట్టుంది. అక్కడికి వచ్చి గుండెలు బాదుకుంటూ గగ్గోలెత్తారు. కుమిలి కుమిలి ఏడ్చారు.

ఐదో రోజున కర్ఫ్యూ కొన్ని గంటల పాటు సడలించారు. స్వేచ్ఛకు మొగం వాచిన వాళ్లలా ఒక్క సారిగా బయట పడ్డారందరూ. కర్ఫ్యూ నీలినీడ సోకి ఎందరు అమాయక ప్రజలు ఏ విధంగా నలిగిపోయిందీ ఒక్కొక్కటే తెలియ సాగినయ్.

అయిన వాళ్లు అనారోగ్యంతో విలవిలలాడుతుంటే, ఏం చేయాలో తోచక నిస్సహాయంగా రోదించారు కొందరు. పోషించే ఒక్కచెయ్యీ విరిగిపోయి దిక్కులేని వాళ్లయ్యారు మరి కొందరు. ఏ రోజు సంపాదనతో ఆ రోజు పొట్టనింపుకునే రోజు కూలీల ఆకలి కేకలు ఒక పక్క. తల్లి దండ్రులిద్దరూ ఉచకోతకి గురై, అనాథలుగా మిగిలిపోయిన పసికందులు మరో పక్క. మత రక్కసి కోరలకి చిక్కి ప్రాణాలు కోల్పోయిన వాళ్ల బంధువుల రోదనలు మిన్ను ముట్టాయి.

తగలబడి పోయిన ఇంటికి సంబంధించిన వారి పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. ఆ ఇల్లు తాతల నాటిదీ, తండ్రుల నాటిదీ కాదు. పైసా పైసా కూడబెట్టి, బ్యాంకులో అప్పు తీసుకొని ఆ రెంటిని కలిపి తన జీవితాశయంగా మొన్నీ మధ్యే నిర్మించుకున్న కలల పంట. ఆ ఇల్లు కట్టి సంవత్సరమైనా కాకముందే అగ్నికి ఆహుతై పోయిది. అది తప్ప మరే ఆస్తిపాస్తులు లేని వాళ్లభవిష్యత్తు ఏమిటన్నది ఊహించడమే కష్టం.

కూడు బెట్టలేని మతం, నోటి దగ్గర కూడుని కూలదోసింది. నీడనివ్వలేని మతం ఉన్న నీడని చెరిపేసింది. ఏం సాధించాలను కుంటున్నారు మతం పేరుతో? అసలు ఎవరికి కావాలీ మతం? రిక్షావాడు మతం అడిగి రిక్షా తొక్కుతున్నాడా? చెప్పులు కుట్టేవాడు మతం అడిగి కుడుతున్నాడా? మంగలివాడు మతం అడిగి క్షవరం చేస్తున్నాడా? చాకలివాడు మతం అడిగి బట్టలుతుకుతున్నాడా? ఎవరి కావాలి? ఎవరకీ అక్కర లేదు, ఒక్క రాజకీయ నాయకులకి తప్ప.

ప్రభుత్వాధికారులు, నాయకులు రాజకీయ పార్టీలు, ఒక్కొకరే హతుల కుటుంబాలను పరామర్శిస్తున్నారు. ఆకలితో అలమటించి పోయే వాళ్లకి జోలపాట వినిపించినట్టు, దుఃఖంలో మునిగిపోయిన వాళ్లకి తమ సానుభూతిని ప్రకటిస్తున్నారు. ఊబిలో కూరుకుపోతున్న వాడికి గడ్డి పోచని ఆధారంగా అందించినట్టు ఇల్లు తగలబడి పోయిన కుటుంబానికి ప్రభుత్వం పదివేల రూపాయల ఆర్థిక సహాయం అందించింది.

వారం రోజుల తర్వాత, ఒక సాయంత్రం పూట ఏదో పార్కులో పబ్లిక్ మీటింగ్ జరుగుతూ ఉంటే కాస్సేపు విందామని నిలబడ్డాను. ప్రతిపక్ష పార్టీ నాయకుడు అనర్గళంగా ఉపన్యసిస్తున్నాడు.

శాంతి భద్రతల్ని కాపాడ్డంలో, మత సామరస్యాన్ని రక్షించడంలో అధికార పార్టీ పూర్తిగా విఫలమైందనీ, అధికారంలో కొనసాగే హక్కు ఆ పార్టీకి ఇంక ఎంత మాత్రం లేదనీ, ముఖ్యమంత్రి రాజీనామా చేసి ఎన్నికలు జరిపించాలనీ డిమాండ్ చేశాడు. ప్రజల చప్పట్ల వర్షం జోరుగా కురుస్తోంది.

ప్రతి పక్ష నాయకుడిగా ఇతనికి చాలా మంచి పేరుంది. ఇప్పుడిప్పుడే గాలి ఇతని వైపు వీస్తున్నది. దానికి తోడు ఈ సంఘటన. ఈ దెబ్బతో అతను పదవిలోకి రావడం ఖాయం అనుకుంటున్నారు అందరూ. అతని ఉపన్యాసంలోని సారాంశం సబబుగానే తోచింది. ప్రస్తుత ప్రభుత్వం శాంతి భద్రతల పరిరక్షణలో పూర్తిగా విఫలమైందన్న విషయం సువిదితమే. మత సామరస్యాన్ని సాధించలేక పోయింది. ఒక వేళ ఎన్నికలంటూ జరిగితే ఈ నాయకుడికే ఓటు వేయాలని మనసులోనే తీర్మానించేసుకున్నాను.

నాలాగే కొన్ని వేల మంది తీర్మానించుకొని ఉంటారని ఖచ్చితంగా చెప్పగలను. కానీ, వాళ్లెవరికీ కలగడానికి వీల్లేదని ఒక అనుభవం ఆ క్షణంలో నాకు కలిగింది. అసలు ఏ రాజకీయ నాయకుడికీ ఓటు వేయకూడదనే నిర్ణయాన్ని తీసుకునేలా చేసిందా అనుభవం!

నాయకుడి ఉపన్యాసపు జోరుకి ప్రజల చప్పట్లు ఉవ్వెత్తున కెరటాల్లా ఎగసి వస్తున్నాయి. ప్రజల హర్షాతిరేకాల మధ్య ఒక వ్యక్తి తన అభిమానాన్ని చాటుకోడానికి స్టేజి ఎక్కి పూల దండని నాయకుని మెడలో అలంకరించాడు.

ఎన్నో శక్తివంతమైన కెమెరాలు ఆ దృశ్యాన్ని ఫోటో తీశాయి. అయితే నా కళ్లు ఆ కెమెరాలన్నిటి కన్నా శక్తి వంతంగా అతని రూపాన్ని నా మనోఫలకం మీద ముద్రించగలిగాయి.

అతన్ని చూసి ఉలిక్కిపడ్డాను. నా ఆశ్చర్యానికి అంతులేకపోయింది. నా కళ్లు నన్నెప్పుడూ మోసం చేయవు. అతనే... వారం రోజుల క్రితం, ఒక కాళరాత్రి చీకటిలో ఇంటిని ధ్వంసం చేస్తుండగా గేటుకొన తగిలి ముసుగు జారిన దుండగీడు.

మారణ హోమాన్ని సృష్టించిన వ్యక్తి, అదే మారణ హోమాన్ని నిరసిస్తున్న నాయకుడికి సన్మానం చేయడమా? ఇదెలా సంభవం? ఇందులోని అంతరార్థమేమిటి? అప్పుడు తోచింది నాకు. ఈ దేశంలో మత కలహాలనేవి లేవు. ఎవరి మతాన్ని వారు ఆరాధించుకుంటున్నారు. ఎవరి మతం కట్టుబాట్లలో వాళ్లు మనుగడ సాగిస్తున్నారు. జరిగే మారణ హోమమంతా దుష్ట రాజకీయ నాయకులు అధికార దాహంతో ఆడుతున్న రాజకీయ చదరంగం మాత్రమేనని.

ఇల్లు తగల బడి పోయిన కారణంగా వీధి పాలైన కుటుంబానికి తాత్కాలికమైన నీడ కల్పించడానికి ఆ వీధిలోని కొందరు యువకులు చురుకుగా తిరిగి చందాలు వసూలు చేసి ఇంటిని నివాస యోగ్యంగా పునరుద్ధరించారని తెలిసి చాలా ఆనందించాను. అంతకంటే ఎక్కువగా ఆ కార్యక్రమానికి పూనుకొన్న వాళ్లపేర్లు వినిచాలా ముచ్చట పడ్డాను. సంతోషం పరవళ్లు తొక్కింది. ఆ పేర్లు రాజా, బాషా, కృష్ణ, రహీమ్, అశోక్, జోసెఫ్.......

ఇది మత సామరస్యం కాదా? ఎక్కడున్నాయ్ మత కలహాలు?!

